క్లుప్తంగా

హాస్టల్‌లో రాత్రి బస



హాస్టల్‌లో విద్యార్థులతో నిద్రిస్తున్న డీఈవో

కంచిలి: కంచిలి బీసీ హాస్టల్‌ను డీఈవో తిరుమల చైతన్య మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనిలో భాగంగా విద్యార్థులకు అక్కడి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి నిద్రించారు.

మద్యం షాపుల్లో ఆకస్మిక తనిఖీలు

పలాస: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఉన్న మద్యం షాపుల్లో ఎక్సైజ్ పోలీసులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. కాశీబుగ్గ ఎక్సైజ్ సీఐ కె.మల్లిఖార్జునరావు, హెచ్‌సీ ఎస్.కృష్ణారావు, ఎస్.సూర్యనారాయణ తదితరులు తనిఖీలు చేపట్టారు. మద్యం షాపుల్లో అమ్మకాల రికార్డులను పరిశీలించారు. లూజ్ మద్యం అమ్మకూడదని, అలాగే అక్కడ తాగడానికి అవకాశం కల్పించకూడదని, అధిక రేట్లుకు అమ్మకూడదని స్పష్టం చేశారు. బెల్టు షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కంచిలి: కళాశాల విద్యార్థులు డ్రగ్స్, గంజాయి, మద్యపానం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ పి.పారినాయుడు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు 'సంకల్పం' అనే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి.హరిప్రసాద్, ఎన్ఎస్ఎస్ పీవో నరసింహకుమార్ దాస్, అధ్యాపకులు డి.సోమేశ్వరరావు, జి.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బాలియాత్రకు అధ్యయన బృందం

కాశీబుగ్గ: ఒడిశా రాష్ట్రం కటక్ నగరంలో మహానది తీరాన జరుగుతున్న బాలి యాత్రను పరిశీలించేందుకు జిల్లాకు చెందిన అధ్యయన బృందం పర్యటించింది. ఇటీవల కళింగ సీమ ప్రాచీన వైభవాన్ని తెలియజేసే బాలి యాత్రను ఈనెల 17న శ్రీముఖలింగంలో పునః ప్రారంభించడం జరిగింది. దీంతో రానున్న 2025 శ్రీముఖలింగంలో అంగరంగ వైభవంగా జరిపించడం కోసం అధ్యయనం చేయడానికి శ్రీకాకుళం జిల్లా నుంచి సోమవారం కటక్ బాలి యాత్రకు వెళ్లడం జరిగింది. వెళ్లినవారిలో కమిటీ సభ్యులు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు, హెచ్‌వీ దొర, బొడ్డేపల్లి శ్రీరామ్, నేతాజీ, చందు భరద్వాజ్ తదితరులు ఉన్నారు.

మెప్మాలో బదిలీలు

కాశీబుగ్గ: జిల్లాలో ఉన్నటువంటి మున్సిపాలిటీల్లోని మెప్మా విభాగంలో పలువురికి బదిలీలు జరుగుతున్నట్లు మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం నుంచి మంగళవారం ఒక ప్రకటన విడుదల అయ్యింది. వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లో భాగంగా ఇచ్ఛాపురం మున్సిపాలిటీ మెప్మాలో పనిచేస్తున్న డీఈవో బోర విజయకుమార్‌రెడ్డిని పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి బదిలీ చేశారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఇప్పటివరకు డీఈవోగా పనిచేసిన బి.శ్రీనివాసరావును ఇచ్ఛాపురం మున్సిపాలిటీకి బదిలీ చేశారు.

కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష

సంతబొమ్మాళి: ఎస్సీ, ఎస్టీ కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.20వేలు జరిమానా విధిస్తూ శ్రీకాకుళం నాల్గో అదనపు ఎస్సీ, ఎస్టీ న్యాయమూర్తి ఎం.ఫణికుమార్ మంగళవారం తీర్పు చెప్పారని సంతబొమ్మాళి ఎస్ఐ సింహాచలం తెలిపారు. 2022 ఏప్రిల్ 19న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ నరసాపురంలో మోడి భాస్కరరెడ్డి ఇంటికి పరామర్శకు వెళ్లారు. అదే రోజు సాయంత్రం 7 గంటలకు ఫిర్యాదు దారుడు కూరాకుల అప్పారావు ఇంటికి వెళ్లిపోవడానికి మోడి భాస్కరరెడ్డి ఇంటి ముందు సిమ్మెంట్ రోడ్‌పైకి రాగానే.. అదే గ్రామానికి చెందిన నయిని పాత్రుని ముకుంద రెడ్డి పల్సర్‌బైక్‌తో అతి వేగంగా వచ్చి అప్పారావు ఎడమ చేతికి గుద్దాడు. నెమ్మదిగా బండి నడపవచ్చుకదా అని అప్పారావు ప్రశ్నించగా కులం పేరుతో దూషించి చెంపపై కొట్టినట్లు అప్పారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ గోవిందరావు కేసు నమోదు చేయగా కాశీబుగ్గ డీఎస్పీ శివరామిరెడ్డి దర్యాప్తు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రత్యేక పీపీ రఘురాం కేసును వాదించి ముద్దాయి నేరం నిరూపణ చేశారు. దీంతో మూడేళ్ల జైలుతో పాటు రూ.20వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కంచిలి: బెల్టు షాపులపై దాడుల్లో భాగంగా సోంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.బేబి ఆధ్వర్యంలో కంచిలి మండల పరిధి కుమ్మరిపేట గ్రామంలో మంగళవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో భాగంగా 10 బెంగుళూరు విస్కీ బాటిళ్లు, 5 ఆఫీసర్స్ చాయిస్ విస్కీ మొత్తంగా 15 వరకు 180 ఎంఎల్ మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకొని ఎస్.లీలారాణిని అరెస్ట్ చేయడం జరిగింది. అదేవిధంగా శ్రీకాకుళం ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ వారి ఆధ్వర్యంలో మఠం సరియాపల్లి గ్రామంలో దాడులు నిర్వహించగా, 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని ముద్దాయిలను రిమాండ్‌కు తరలించారు.

అందాల తీరం..
అభివృద్ధికి దూరం..!

- నిత్యం పర్యాటకులతో సందడిగా తీరం
- వసతుల లేమితో అవస్థలు
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని వేడుకోలు



అక్కుపల్లి శివసాగర్ తీరంలో పర్యాటకులు

వజ్రపుకొత్తూరు రూరల్: విశాలమైన సముద్ర తీరం అక్కుపల్లి సొంతం. ప్రకృతి సోయగాలతో పాటు రమణీయత కలిగిన ఈ తీరం ఎన్నో విశేషాలకు నిలయంగా మారింది. కనుచూపు మేరలో ఇసుక తిన్నెలు, తీరంలో చూడముచ్చటగొలిపే పెద్ద పెద్ద రాళ్లు, తీరానికి అనుకొని పచ్చని చెట్లుతో ఆహ్లాదకరంగా ఉంటుంది. అలాగే సముద్రం మీదుగా వీచే చల్లని గాలులు, మరో వైపు అలలు ఘోషతో పాటు బీచ్ రోడ్డులో చరిత్ర కలిగిన నీలకంఠేశ్వరాలయం ఉండడంతో జిల్లాలోనే ప్రధాన పర్యాటన కేంద్రంగా అక్కుపల్లి బీచ్ నిలిచింది. ఇన్ని విశేషాలు సంతరించుకున్న అక్కుపల్లి శివసాగర్ బీచ్ అభివృద్ధికి మాత్రం ఆమడ దూరంలో ఉంది.

తీరం జనసంద్రం

జిల్లాలో ప్రధానంగా అక్కుపల్లి, భావనపాడు, బారువ, కళింగపట్నం, రట్టి, మొగదలపాడుతో పాటు పలు బీచ్‌లు ఉన్నాయి. ఈ తీరాల్లో ఒకటైన అక్కుపల్లి శివసాగర్ బీచ్ అహ్లాదకరంగా ఉండడంతో నిత్యం పర్యాటకుల సందర్శనతో సందడిగా ఉంటుంది. కార్తీక మాసంలో ఫిక్నిక్‌ల సమయంతో పాటు రథసప్తమి లాంటి ప్రత్యేక రోజుల్లో పర్యాటకుల తాకిడితో తీరం జనసంద్రంగా మారుతుంది. ఒడిశా రాష్ట్రంలోని పలు గ్రామాలతో పాటు పలాస, కాశీబుగ్గ, టెక్కలిపట్నం, పరిసర ప్రాంత గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు తీరానికి వస్తుంటారు. ప్రస్తుతం కార్తీక మాసం కొనసాగుతోంది. ఈ సమయం ముగిసిన వెంటనే పిక్నిక్ సందడి ప్రారంభం అవుతుంది. ప్రతిఏటా ఈ సీజన్‌లో సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు వారి కుటుంబ సభ్యులు, తోటి స్నేహితులతో కలిసి తీరానికి చేరుకొని అనందంగా గడుపుతున్నారు. అయితే అహ్లాదకరమైన తీరంపై పాలకులు శీతకన్ను వేయడంతో అభివృద్ధికి నోచుకోవడం లేదు. దీంతో తీరంలో సరైన వసతులు లేకపోవడంతో పర్యాటకులు అవస్థలు పడుతున్నారు. అలాగే బీచ్ అకతాయిలకు అడ్డాగా మారింది.

మందుబాబుల వీరవిహారం

అక్కుపల్లి శివసాగర్ బీచ్‌కు సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. అయితే అభివృద్ధికి నోచుకొని ఈ తీరం అకతాయిలతో పాటు మందుబాబులకు అడ్డాగా మారింది. అలాగే సందర్శకులు వినియోగించిన ప్లాస్టిక్ వస్తువులు, మద్యం సీసాలు తీరంలో ఎక్కడికక్కడ దర్శనం ఇస్తుండడంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు మందుబాబులు పూటుగా మద్యం సేవించి మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నా పట్టించుకొనే నాథుడు కరువయ్యాడని మహిళ పర్యాటకులు వాపోతున్నారు.

తీరంలో అన్నీ సమస్యలే

సామాన్య ప్రజల బిజీ లైఫ్‌లో కొంత సమయం రిలాక్స్ అయ్యేందుకు సముద్ర తీరాలు ఉత్తమమైనవి. దీంతో అనందంగా గడిపేందుకు ఈ తీరానికి వచ్చే పర్యాటకులకు అనేక సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ప్రధానంగా మహిళలు దుస్తులు మార్చుకునేందుకు గదులు లేవు, మల, మూత్ర విసర్జన కోసం కనీస సదుపాయాలు లేవు. వాహనాలు పార్కింగ్ చేసేందుకు స్థలం లేదు. బీచ్ రోడ్డు ఇరుకుగా ఉండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. తీరంలో చెత్తచెదారం పేరుకుపోవడంతో అధ్వానంగా కనిపిస్తోంది. అలాగే ప్రమాదకరంగా మద్యం సీసాలు, పగిలిన గాజు పెంకులతో పాటు అర్ధంతరంగా నిర్మాణ పనులు నిలిచిన రేకుల షెడ్లు పర్యాటకులకు దర్శనం ఇస్తున్నాయి.



తీరంలో పడివున్న మద్యం సీసాలు

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



సముద్ర తీరంలో ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోయి అధ్వానంగా ఉంది. తీరంలో మద్యం సీసాలు, గాజు పెంకులు దర్శనం ఇస్తున్నాయి. అనందం కోసం బీచ్‌కు వచ్చే పర్యాటకులకు వినోదం కలగాలే తప్పా విషాదం కలగకూడదు. తీరంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి.

– టి.మురళి మోహన్, పర్యాటకుడు

పర్యాటక కేంద్రం చేయాలి



అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో విశాలమైన సముద్ర తీరంతో పాటు అహ్లాదకరమైన వాతావరణం ఉంది. దీంతో సుదూర ప్రాంతాల నుంచి నిత్యం పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. పర్యాటకుల తాకిడిని దృష్టిలో పెట్టుకొని అక్కుపల్లి తీరాన్ని అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి.

– దొంక ఉషారాణి, సర్పంచ్, బైపల్లి

వసతులు కల్పించాలి



చాలా మంది పర్యాటకులు తమ కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా గడిపేందుకు బీచ్‌కు వస్తున్నారు. తీరంలో సరైన సదుపాయాలు లేకపోవడంతో ప్రధానంగా మహిళలు ఇబ్బంది పడుతున్నారు. శివసాగర్ బీచ్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే చాలా బాగుంటుంది. బీచ్ అభివృద్ధి చెందితే దూర ప్రాంతం నుండి వచ్చే పర్యాటకులకు మరింత సంతృప్తి కలుగుతుంది.

– టి.రోజా, పర్యాటకురాలు, టెక్కలి



అర్ధంతరంగా ఆగిపోయిన షెడ్ల పనులు



ఇరుక రోడ్డులో ఇబ్బందులు పడుతున్న పర్యాటకులు

బాహుదాపై వంతెన నిర్మాణం చేపట్టాలి

ఇచ్ఛాపురం: బాహుదా నదిపై కొత్త వంతెన నిర్మాణం చేపట్టాలని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నర్తు నరేంద్రలతో పాటు స్థానిక వ్యాపారవేత్తలు, విద్యార్థులు, యువకులు రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని శ్రీసురంగి రాజా క్రీడా మైదానంలో కొత్త వంతెన నిర్మాణం కోసం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా శ్యామ్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. నదిపై బ్రిటీష్ కాలం నాటి వంతెనలో సగభాగం కూలిపోయి ఎడాదిన్నర కాలం గడిచిందన్నారు. దీంతో ఈ మార్గం గుండా బస్సులు, వ్యాన్‌ల రాకపోకలు నిలిచిపోయాయని పేర్కొన్నారు. ప్రస్తుతం వీటి రాకపోకలను జాతీయ రహదారి నుంచి బెల్లుపడ గ్రామం గుండా జరుగుతుండడంతో ఈ మార్గం రద్దీగా మారిందని, దీంతో తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వంతెనకు ఉన్న ప్రాముఖ్యత మేరకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కొత్త వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న సాడి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, నర్తు నరేంద్రలు

ఆర్థిక సాయం అందజేత

టెక్కలి: పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు పీఏ పంతులు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబానికి అభయం యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసర సరుకులతో పాటు ఆర్థిక సాయం అందజేశారు. 25 కిలోల బియ్యంతో పాటు 20 రకాల నిత్యావసర సరుకులు, రూ.6 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు డి.శ్రీనివాస్, పి.గురునాథ్, ఎల్.అనిల్, ఎన్.సింహాచలం, డి.పూర్ణాచారి, మున్నా, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: తల్లిదండ్రులను పోషించాల్సిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. విషయం తెలుసుకున్న పలు సేవా సంస్థలు ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి ముందుకు వస్తున్నారు. మండలంలోని తిప్పనపుట్టుగ గ్రామానికి చెందిన తిప్పన పృథ్వీ వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అసలే పేద కుటుంబం, ఆపై చెట్టంత కొడుకు మృత్యువాత పడడంతో ఆర్థిక భారంతో బాధపడుతున్న తల్లిదండ్రులకు గ్రామానికి చెందిన కాశీమాత సేవా సమితి సభ్యులు మంగళవారం రూ.15,3500 నగదును అందేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

ఇచ్ఛాపురం రూరల్: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం లొద్దపుట్టి ధనరాజుల తులసమ్మ తల్లిని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మంగళవారం దర్శించుకున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ నాయకులకు సద్బుద్ధి ప్రసాదించమని కోరుకున్నారన్నారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం, కంచిలి ఎంపీపీలు బోర పుష్ప, పైలా దేవదాసు రెడ్డి, సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, నర్తు నరేంద్రయాదవ్, పూడి నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

నందిగాం: మండలంలోని దేవళభద్రలో పాతపట్నం అమ్మ, చింతపోలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ పాల్గొన్నారు. ఆయనతో పాటు ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, సర్లాన బైరాగి, బాలక మధుసూదనరావు, నడుపూరు పాపారావు, పీత రమణబాబు, కె.జీవన్, బాలక ప్రభాకర్ తదితరులు ఉన్నారు.



ఇచ్ఛాపురం రూరల్: ధనరాజులమ్మను దర్శించుకుంటున్న మాజీ మంత్రి సీదిరి

అక్షర సందేశం

ప్రపంచాన్ని స్వచ్ఛంగా మార్చడానికి ఏటా నవంబర్ 19న ఐక్యరాజ్య సమితి టాయిలెట్స్ డే నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా మందస మండలం బాలిగాం గ్రామంలో ఆదిత్య కళాశాలలో విద్యార్థు టాయిలెట్ అక్షర ఆకారంలో కూర్చుని ఆకట్టుకున్నారు.



– కాశీబుగ్గ

మర్యాదపూర్వక భేటీ



డీఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

కాశీబుగ్గ: కాశీబుగ్గ పోలీసు డివిజన్ కేంద్రం అధికారి(డీఎస్పీ) వి.వెంకటఅప్పారావును పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ నాయకులు మంగళవారం కలిశారు. బీసీ సెల్ రాష్ట్ర నాయకులు లొడగల కామేశ్వరరావు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, కాష్యూ లేబర్ అసోసియేషన్ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి, మాజీ కౌన్సిలర్ సవర రాంబాబు, నాయకులు బద్రి గోపాల్, కొత్త సత్యం తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా అక్రమ రవాణా అడ్డగింత

కాశీబుగ్గ: రాత్రి మూడు గంటలకు అక్రమంగా తరలిస్తున్న మందుగుండు సామగ్రిని కాశీబుగ్గ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 17వ వార్డు తిలక్‌నగర్‌లో అక్రమంగా తరలిస్తున్న మందుగుండు సామగ్రిని పట్టుకున్నారు. బొలేరా వాహనంలో దీపావళికి కాల్చే మందుగుండును నలుగురు వ్యక్తులు తరలిస్తుండగా తనిఖీలు చేసి పట్టుకున్నారు. రూ.రెండు లక్షల ఇరవైనాలుగు వేల రూపాయల విలువైనదిగా గుర్తించామని, నలుగురిని అరెస్టు చేసి వాహనాన్ని సీజ్ చేశామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కాశీబుగ్గ ఎస్ఐ మెట్ట చంద్రరావు తెలిపారు.

బొలేరో వాహనం బోల్తా



బోల్తాపడిన బొలేరో వాహనం

సోంపేట: మండలంలోని కొర్లాం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున బొలేరో వాహనం అదుపుతప్పి కాలువలో బోల్తా పడింది. విజయనగరం నుంచి ఒడిశాకు కాయగూరల లోడుతో వెళ్తున్నట్లు బారువ పోలీసులు తెలిపారు. ప్రమాదంలో ఎవరికీ ప్రమాదం జరగలేదు. బారువ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, వాహనాన్ని తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

ప'రిక్ష'



జీడి పరిశ్రమల్లో అన్ని రకాల పద్ధతులను దాటుకుని ఎగుమతులకు సిద్ధమయ్యే జీడి పప్పు పెట్టెలను తరలించడానికి రోజంతా కష్టపడే రిక్షా కార్మికులు వేకువజామునే పలాస ఇందిరమ్మ కూడలి వద్దకు చేరుకుంటారు. ఎవరు ముందు వస్తే వారికి పని దొరుకుతుందని సిద్ధంగా ఉంటారు. ఏ పరిశ్రమదారుడు పిలుస్తాడోనని ఎదురు చూస్తుంటారు. మంగళవారం ఉదయం పలాసలో అనేక మంది రిక్షా కార్మికులు, రిక్షాలు సిద్ధంగా ఉన్న సమయంలో సాక్షి కెమెరా తీసిన చిత్రమిది.

– కాశీబుగ్గ

స్మార్ట్ మీటర్ల అమరిక



కోటబొమ్మాళి–కొత్తపేటల్లో మంగళవారం విద్యుత్ శాఖ సిబ్బంది ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలకు స్మార్ట్ మీటర్లను అమర్చారు. పాత మీటర్లను తొలగించి వాటి స్థానంలో స్మార్ట్ మీటర్లను పెడుతున్నారు. ప్రస్తుతానికి ఈ మీటర్లు పాత బిల్లింగ్ విధానంలోనే పనిచేస్తున్నాయి. త్వరలో గృహాలకూ అమర్చేందుకు విద్యుత్ శాఖ సిద్ధమవుతోంది. ఈ విధానం అమలైతే సెల్‌ఫోన్‌కు రీచార్జి చేసినట్లే ముందుగానే రీచార్జి చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో ఈ మీటర్ల గురించి తెలుసుకుంటున్న వినియోగదారుల్లో అయోమయం నెలకొంది.

– కోటబొమ్మాళి

పండ్లు పంపిణీ



భగవాన్ సత్యసాయి జయంతి వేడుకలను పురస్కరించుకొని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. మహిళలతో నగర సంకీర్తన నిర్వహించి, అనంతరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, ప్రసాదం పంచిపెట్టారు. కార్యక్రమంలో కన్వీనర్ బి.మల్లేశ్వరరావు, సభ్యులు కె.వైకుంఠరావు, టి.వెంకట్రావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

– టెక్కలి

వీవోఏపై విచారణ



వీవోఏపై విచారణ జరుపుతున్న ఏపీఎం ప్రసాదరావు

కంచిలి: మండలంలోని కత్తివరం వీవోఏ నీలవేణిపై ఇందిరా క్రాంతి పథం ఏపీఎం ఎస్.ప్రసాదరావు విచారణ జరిపారు. కత్తివరం గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు దుర్గాసి మాధవి అధ్యక్షతన మంగళవారం గ్రామసభను నిర్వహించారు. గ్రామానికి చెందిన కె.కామేశ్వరరావు పీజీఆర్ఎస్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు కత్తివరం వీవోఏ నీలవేణిపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ విచారణ చేపట్టారు. విచారణలో వీవోఏ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆమెకు కనీస విద్యార్హతలు లేవని, పుస్తక నిర్వహణ లేదని, బ్యాంకు రుణాలు, శ్రీనిధి, గ్రామ సంఘం అప్పులు ఇచ్చినప్పుడు లంచాలు వసూలు చేస్తున్నారని, గ్యాస్ లబ్ధిదారుల వద్ద కొంత మొత్తం నగదు వసూలు చేసి, వారికి వచ్చిన గ్యాస్ కనెక్షన్లు వాళ్లకు అందజేయకుండా వేరొకరికి అందించారని ఫిర్యాదు చేశారు. సంఘాల వద్ద ఉన్న అప్పులను సంఘ సభ్యులు ఎప్పుడో చెల్లించినప్పటికీ అవి ఇంకా బకాయిలు ఉన్నాయని, ఆ అప్పు బకాయికి మాకు సంబంధం లేదని ఆయా సభ్యులు సభలో తెలిపారు. విచారణలో గ్రామ సంఘంలో ఉన్న 38 సంఘాలకుగాను 31 సంఘాల లీడర్లు, సభ్యులు హాజరయ్యారు. ఇటువంటి వీవోఏ తమకు వద్దని, అన్ని అర్హతలు ఉన్న కొత్త వ్యక్తిని నియమించాలని సభ్యులు డిమాండ్ చేశారు. విచారణకు వీవోఏ నీలవేణి గైర్హాజరైనట్లు ఏపీఎం తెలిపారు. విచారణలో సీసీలు ప్రమీల, పాపారావు, ఫిర్యాదుదారు కామేశ్వరరావు, గ్రామ సంఘం ప్రతినిధులు, సంఘాల లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

ట్రూ అప్ చార్జీలు తగ్గించాలి

టెక్కలి: కూటమి ప్రభుత్వం వినియోగదారులపై తీవ్రమైన భారం విధించిన ట్రూ అప్ చార్జీలను తక్షణమే తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం డివిజన్ కేంద్రమైన టెక్కలిలో విద్యుత్ ఏఈ కార్యాలయం ఎదుట నిరసన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు ఎస్.షణ్ముఖరావు మాట్లాడుతూ.. ఇప్పటికే నిత్యావసర ధరలను పెంచి సామాన్య ప్రజలపై ఆర్థిక భారం వేశారని, ఇప్పుడు విద్యుత్ చార్జీలతో పాటు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు గుదిబండగా మారిందని పేర్కొన్నారు. తక్షణమే చార్జీలు తగ్గించి స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఆపాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కె.ఎల్లయ్య, బి.వాసుదేవరావు, బి.ధర్మారావు, సంజీవరావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



ఏఈ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న సీపీఎం నాయకులు

పరామర్శ

టెక్కలి: మండలంలోని పలు కుటుంబాలను వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ మంగళవారం పరామర్శించారు. బన్నువాడ మాజీ ఎంపీటీసీ పోలాకి సోమేశ్వరరావు ఇటీవల అనారోగ్యానికి గురవ్వడంతో పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. అలాగే వీఆర్‌కేపురం గ్రామంలో బలగ గురయ్య, బలగ వీరన్న తదితరులు అనారోగ్యానికి గురవ్వడంతో, వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ఆయనతో పాటు నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, సర్పంచ్ పి.మోహన్‌రావు, మాజీ పీఏసీఎస్ చైర్‌పర్సన్ సత్తారు సత్యం, నాయకులు టి.కిరణ్, బి.తులసీరావు, బి.భుజంగరావు, కె.జీవన్, మోహన్‌రావు, పి.రమణబాబు, ఎస్.పాపారావు తదితరులు ఉన్నారు.



సోమేశ్వరరావును పరామర్శిస్తున్న పేరాడ తిలక్

కేసులు నమోదు చేయాలి

సోంపేట: బెల్టుషాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేయాలని ఎక్సైజ్ శాఖ జిల్లా డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్ రెడ్డి సూచించారు. సోంపేట ఎక్సైజ్ స్టేషన్‌ను మంగళవారం ఆయన పరిశీలించి, సమీక్ష నిర్వహించారు. మద్యం దుకాణదారులు ఎటువంటి ఉల్లంఘనలకు పాల్పడకుండా ఉండేలా చూసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. బెల్లం అమ్మకాల మీద నిరంతరం నిఘా ఉంచాలని, నాటు సారా అక్రమ రవాణా, తయారీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ కె.బేబి, ఎస్ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు గడువు పెంపు

టెక్కలి: సార్వత్రిక విద్యా పరిషత్ ఓపెన్ పది, ఇంటర్‌లో ప్రవేశాలకు ఫీజు గడువు పెంచినట్లు టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రం ప్రధానోపాధ్యాయుడు డి.నాగభూషణం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 లోగా అపరాధ రుసుముతో నేరుగా ప్రవేశించవచ్చునని పేర్కొన్నారు.